
సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 5 । జనవరి । 2025






విద్యుత్ కాంతులతో యుద్ధ నౌకలు

నేవీ షో.. అదిరింది



కంటిన్యుటీ డ్రిల్




ముఖ్యమంత్రి చంద్రబాబుకు జ్ఞాపిక బహూకరిస్తున్న మెరైన్ కమాండో, చిత్రంలో ఈఎస్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్



లేజర్ షో





చేతక్ హెలికాప్టర్ల విన్యాసం



జయహో భారత్



బందీలను విడిపించేందుకు తీరానికి చేరుకున్న మార్కోస్





విన్యాసాలు తిలకిస్తున్న నేవీ అధికారులు, వారి కుటుంబ సభ్యులు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో భారత నావికాదళం సమర శంఖం పూరించింది. దేశ రక్షణలో నావికాదళం చేస్తున్న కృషిని ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించింది. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా శనివారం సాయంత్రం నిర్వహించిన ఆపరేషనల్ డెమో ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. సాయంత్రం 4.40 గంటలకు ప్రారంభమైన విన్యాసాలు సుమారు గంటన్నర పాటు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, తూర్పు నావికాదళ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, మంత్రులు వంగలపూడి **అనిత, కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీలు గొల్ల బాబూరావు, సీఎం రమేష్, మేయర్ హరివెంకటకుమారి,** ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, బండారు సత్యనారాయణమూర్తి, కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, నేవీ సిబ్బంది విన్యాసాలను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మారిటైం గేట్ వేగా ఏపీ అభివృద్ధి చెందుతోందన్నారు.



బాణసంచా వెలుగులు

విన్యాసాలు సాగాయిలా..

- భారత నావికాదళం అద్భుతమైన విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ముందుగా జాతీయ, నావికాదళ పతాకాలను ఎగురవేశారు. నావికాదళ వాద్య బృందం శ్రావ్యమైన జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ఆరంభమైంది. అనంతరం చేతక్ హెలికాప్టర్లు త్రివర్ణ పతాకం, నావికాదళ పతాకాన్ని రెపరెపలాడిస్తూ ఆకాశంలో విహరించాయి.
- విపత్కర పరిస్థితుల్లో బందీలను విడిపించడానికి మెరుపుదాడి చేసే మెరైన్ కమాండోల(మార్కోస్) విన్యాసాలు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేశాయి. హెలికాప్టర్ నుంచి తాడు సహాయంతో సముద్రంలోకి దిగిన కమాండోలు, వెంటనే బోటులో తీరానికి చేరుకుని బందీలను విడిపించిన తీరు ఉత్కంఠభరితంగా సాగింది. వారి ధైర్యసాహసాలకు ప్రజలు సెల్యూట్ చేశారు. ఆయిల్ రిగ్ పేల్చివేత విన్యాసం ప్రేక్షకులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.
- ఆకాశం నుంచి నాలుగు పారాచూట్ల సాయంతో దిగిన మార్కోస్ బృందం ప్రత్యేక జ్ఞాపికను సీఎం చంద్రబాబు నాయుడుకు అందజేసింది.
- ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ యుద్ధ నౌకలపై హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు ల్యాండింగ్ అయిన విధానం విశేషంగా ఆకట్టుకుంది.
- తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ, శత్రువుల రాడార్లకు చిక్కకుండా సంచరించే హాక్ యుద్ధ విమానాల వ్యూహాత్మక విన్యాసాలు, నాలుగు చేతక్ హెలికాప్టర్ల విన్యాసాలు కనులపండువగా సాగాయి. అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల అన్వేషణ, రక్షించే విధానాల ప్రదర్శన ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది.
- నావికాదళ సిబ్బంది విధులు, వారి జీవనశైలిని వివరిస్తూ సీ క్యాడెట్ కార్ప్స్ విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన లయబద్ధంగా సాగింది. యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ ఫైరింగ్, యుద్ధ నౌకల నుంచి చేసిన నమూనా కాల్పులు చూపరులను కట్టిపడేశాయి. చేతక్, సీ కింగ్ హెలికాప్టర్లు, డార్నియర్ హెలికాప్టర్, హాక్ జెట్ ఫైటర్ల విన్యాసాలు ఉత్సాహాన్ని నింపాయి.
- చివరగా నావికాదళ వాద్య బృందం ప్రత్యేకంగా అందించిన బీటింగ్ రిట్రీట్, తుపాకులతో అగ్నిని రగిలించే కంటిన్యుటీ డ్రిల్ కవాతు, నౌకలపై మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల అలంకరణలు, బాణసంచా ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఐఎన్ఎస్ సావిత్రి నుంచి నిర్వహించిన లేజర్ షో.. దేశభక్తి గీతాలకు అనుగుణంగా సాగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం అదరహో అనిపించింది. ప్రాచీన యుద్ధ కాలం నుంచి నేటి వరకు భారత రక్షణ వ్యవస్థ ప్రతిష్టను డ్రోన్ షో కళ్లకు కట్టినట్టు చూపించింది.
- నేవీ విన్యాసాల్లో ఎటువంటి అపశృతులు జరగకుండా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పర్యవేక్షించారు.



విన్యాసాలను తిలకిస్తున్న నగర ప్రజలు

ప్రధాని పర్యటనకు భారీ ఏర్పాట్లు

మహారాణిపేట: భారత ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యాటక ఖరారైంది. ఈ మేరకు షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేశారు. ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు న్యూఢిల్లీ నుంచి ప్రధాని బయల్దేరి సాయంత్రం 4.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 4.45 గంటలకు వెంకటాద్రి వంటిల్లు రెస్టారెంట్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ వరకు జరగనున్న రోడ్ షోలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అక్కడ నుంచి బయల్దేరి రాత్రి 6.55 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. రాత్రి 7 గంటలకు విమానంలో భువనేశ్వర్‌కు బయల్దేరుతారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. బహిరంగ సభ నిర్వహించే ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం, రోడ్డు షో జరిగే ప్రాంతాల్లో ఏర్పాట్లను కలెక్టర్, జేసీలు పర్యవేక్షిస్తూ.. అధికారులకు సూచనలు చేస్తున్నారు. ఏర్పాట్ల కోసం 42 కమిటీలను నియమించారు. నలుగురు ఐఏఎస్‌లను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించగా.. వీరు శనివారం విశాఖ చేరుకున్నారు. ఇతర జిల్లాల నుంచి 10 మంది డిప్యూటీ కలెక్టర్లు, 20 మంది తహసీల్దార్లు విశాఖ చేరుకుని ఎవరికి కేటాయించిన పనుల్లో వారు నిమగ్నమయ్యారు.



ఏర్పాట్లపై జీవీఎంసీ, ఆర్ అండ్ బీ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

బారికేడ్లు ఏర్పాటు చేయండి

డాబాగార్డెన్స్: ప్రధాని మోదీ పర్యటన మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. ఎన్ఏడీ జంక్షన్ నుంచి ఏయూ కాలేజ్ గ్రౌండ్ సభా వేదిక వరకు శనివారం జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ శివప్రసాదరాజు, ఆర్ అండ్ బీ పర్యవేక్షక ఇంజినీర్ సుధాకర్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు.

ఏర్పాట్లు ఇలా..

- బహిరంగ సభకు వచ్చే ప్రజలకు స్నాక్స్, మధ్యాహ్నం పులిహోరా, రాత్రికి బిర్యానీ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- సభకు నగరం నుంచి 1.20 లక్షల మందిని, విశాఖ గ్రామీణ ప్రాంతాల నుంచి 10వేల మందిని, అనకాపల్లి జిల్లా నుంచి 40 వేల మందిని తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సంఖ్యకు అనుగుణంగా ఫుడ్ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నారు.
- ప్రజలను తరలించేందుకు సుమారు రెండు వేల బస్సులను సిద్ధం చేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి ప్రజలను బస్సులు, ఇతర వాహనాల్లో తీసుకొచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- జనాల కోసం 300 గ్యాలరీలను, ఒక్కొక్క గ్యాలరీలో 6 వేల మందికి పైగా ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చుతున్నారు.
- రోడ్డు షో నేపథ్యంలో ప్రజలు, ప్రజా ప్రతినిధుల వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 22 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.
- విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.
- సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాల్లో తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలను కల్పించే బాధ్యతలను జీవీఎంసీ చూస్తోంది.

వైఎస్సార్ సీపీ దంపతులపై టీడీపీ వర్గీయుల దాడి

- తీవ్రంగా గాయపడిన భర్త
- పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య
- పట్టించుకోని వైనం?

పరవాడ: వైఎస్సార్ సీపీ నాయకుడు పైల రేగారావు, అతని భార్య మణిపై టీడీపీ వర్గీయులు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలంలోని వెన్నలపాలెం గ్రామానికి చెందిన రేగారావుకు సంబంధించిన స్థలంలో టీడీపీ వర్గీయులు ఈ నెల 2న మరిడిమాంబ నెల పండగ నిర్వహించి అన్నసమారాధన నిర్వహించారు. ఈ క్రమంలో అనుమతి లేకుండా తన స్థలంలో అన్నసమారాధన ఎలా నిర్వహించారని రేగారావు టీడీపీ వర్గీయులను ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. ఈ వివాదంలో టీడీపీకి చెందిన పైల వెంకటరమణమూర్తి (రమణాజీ), వెన్నల ప్రసాద్, బోజంకి అప్పలనాయుడు మరి కొంతమంది రేగారావు, ఆయన భార్య మణిపై కర్రలతో దాడి చేసి

మిగతా 8వ పేజీలో ▶



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేగారావు

600 ఎకరాల ఇనాం భూములపై టీడీపీ కన్ను

- రూ.కోట్లు విలువైన భూమిని కాజేసే యత్నం
- ముచ్చర్లలో నూరుశాతం టీడీపీ సభ్యత్వాలు అంటూ విస్తృత ప్రచారం
- త్వరలోనే భూకబ్జాలు, క్లబ్‌లపై సీపీకి ఫిర్యాదు చేస్తాం..
- మీడియాతో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

తగరపువలస: ఆనందపురం మండలంలోని ముచ్చర్ల పంచాయతీ ప్రజలను మభ్యపెట్టి 600 ఎకరాల ఇనాం భూములను కాజేసేందుకు టీడీపీ కుట్ర పన్నిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. మండలంలోని వేములవలసలో జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు ఇంటి వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామంలో 600 ఎకరాల ఇనాం భూములను కాజేసేందుకు టీడీపీ నేతలు పక్కా స్కెచ్ వేశారన్నారు. ఇందులో భాగంగానే ప్రజల ఆధార్ కార్డులు సేకరించి వారికి తెలియకుండానే సభ్యత్వాలు నమోదు చేశారన్నారు. సభ్యత్వానికి రూ.100 చొప్పున చొప్పున టీడీపీకి చెందిన ఓ నేత చెల్లించాడన్నారు. నూరుశాతం సభ్యత్వాలు పూర్తి చేసుకున్న పంచాయతీగా ముచ్చర్ల నిలిచిందని బిల్డప్ ఇచ్చి.. మంత్రి లోకేష్‌ను ఈ నెల 7న ముచ్చర్లకు ఆహ్వానించారని పేర్కొన్నారు. 600 ఎకరాల ఇనాం భూములను ఆక్రమించుకునే కుట్రలో భాగంగానే లోకేష్ వస్తున్నట్టు ప్రచారం జరుగుతోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారు షిణగం ఎర్రయ్య సర్పంచ్‌గా, 10 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో గుసిడి ముత్యాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా 110 ఓట్ల తేడాతో విజయం సాధించారని గుర్తు చేశారు. పంచాయతీలో 1,400 ఓట్లు ఉంటే 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి 150 ఓట్ల మెజారిటీ వచ్చిందన్నారు. ఇక్కడ ఉన్న వైఎస్సార్ సీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలను కలుపుకుని మొత్తం టీడీపీలో చేరినట్టు పబ్లిసిటీ చేసుకుంటున్నారన్నారు. వ్యాపారం పేరుతో గిడిజాల, ముచ్చర్లలో పాగా వేసిన ఓ వ్యక్తి గత ఎన్నికల్లో టీడీపీ తరఫున ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి 311/14లో 2.40 ఎకరాలు, 310/5లో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడన్నారు. ఈ రెండు చోట్ల క్లబ్బులు నిర్వహిస్తూ ఎవరి వాటాలు

మిగతా 8వ పేజీలో ▶



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

600 ఎకరాల ఇనాం భూములపై టీడీపీ కన్ను

▶7వ పేజీ తరువాయి

వారికి పంచుతున్నాడన్నారు. ఈరోజు కూడా సర్పంచ్ ఎర్రయ్యకు రూ.10 లక్షలు ఎరవేసి ప్రలోభపెట్టాలనుకున్నాడని ఆరోపించారు. ఇక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, భూకబ్జాలపై వైఎస్సార్ సీపీ తరపున కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేయనున్నామన్నారు.

బీసీ, దళిత ప్రజాప్రతినిధులపై జులుం

రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రుల దందాలను అరికట్టలేని సీఎం చంద్రబాబు, సకల శాఖల మంత్రి లోకేష్ తమ గెజిట్ పేపర్ ఈనాడు ద్వారా వారిపై ఆరోపణలు సంధిస్తున్నారన్నారు. 2014–19 హయాంలో అప్పటి మంత్రి దేవినేని ఉమ తిరుమల లడ్డూలు పక్కదారి పట్టించి నెలకు రూ.3 లక్షలు ఆర్జించాడన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూపై సనాతన ధర్మం పేరుతో గగ్గోలు పెట్టిన ఉప ముఖ్యమంత్రి ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనధికార వసూళ్లు, పేకాట క్లబ్బులు, తిరుమల దర్శన సిఫార్సు లేఖలపై స్పందించి హిందూ సంప్రదాయాలను కాపాడాలని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారన్నారు. హోంశాఖ మంత్రి అనితతో పాటు ఎమ్మెల్యే గౌతు శిరీష, మంత్రి పార్థసారథితో టీడీపీ అధిష్టానం క్షమాపణలు కూడా చెప్పించిందన్నారు. ఇదంతా చూస్తుంటే కూటమి పాలనలో దళిత, బీసీ ప్రజాప్రతినిధులకు గౌరవం లేదన్నారు.

వైఎస్సార్ సీపీ కేడర్ బలంగా ఉంది

జిల్లాతో పాటు భీమిలిలో వైఎస్సార్ సీపీ బలం చెక్కు చెదరలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, గాడు శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, అక్కరమాని రామునాయుడు, పాండ్రంకి అప్పారావు, శిల్లా కరుణాకరరెడ్డి, నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, గుడ్ల పోలిరెడ్డి, ఉప్పాడ సూర్రెడ్డి, కోరాడ అప్పలస్వామినాయుడు, ఎస్ చంద్రమౌళి, పాండ్రంగి శ్రీను, పిన్నింటి వెంకటరమణ, గంరెడ్డి శ్రీను, షిణగం దామోదరరావు, లెంక రాంబాబు, బొట్ట రామకృష్ణ, చందక సూరిబాబు, షిణగం అప్పలరాజు, మరుపిల్ల చిన్నయపాత్రుడు, వంకాయల మారుతీప్రసాద్, బోర సూర్రెడ్డి, కలిమి గంగరాజు, రౌతు శ్రీను, ఇల్లపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

దొంగ సభ్యత్వాలు



ఒక ఇంటి వద్ద కూర్చుని 280 సిమ్‌కార్డులు తెచ్చుకుని వారే డబ్బులు చెల్లించి దొంగ సభ్యత్వాలు చేయించారు. సర్పంచ్‌గా నాతో పాటు 10 మంది వార్డు సభ్యులు చేరినట్టు ఎలా ప్రచారం చేసుకుంటారు.

–షిణగం ఎర్రయ్య, సర్పంచ్

ఆందోళన చేస్తాం



పంచాయతీలో ఎవరికీ తెలియకుండానే సభ్యత్వాలు చేయించారు. ఓటీపీలు కూడా మా ఫోన్లకు రాలేదు. మాకు సంబంధం లేకుండా సభ్యత్వాలు తీసుకున్నట్టు తెలిసింది. దీనిపై ధర్నా చేస్తాం.

–గుసిడి ముత్యాలు, ఎంపీటీసీ సభ్యుడు

మహిళలపై మీకున్న గౌరవం ఇదేనా?

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వలంటీర్ల సూటి ప్రశ్న
- రెండో రోజూ కొనసాగిన దీక్ష



జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేస్తున్న వలంటీర్లు

సీతమ్మధార: గ్రామ/వార్డు వలంటీర్ల నిరసన దీక్ష శనివారం కూడా కొనసాగింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వలంటీర్లు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం దీక్ష ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వలంటీర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.'డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వలంటీర్లపై గౌరవం లేదా? మహిళలను గౌరవిస్తామని చెప్పిన పవన్ కల్యాణ్ ఎక్కడ? సీఎం చంద్రబాబు గో బ్యాక్.. పవన్ కల్యాణ్ డౌన్ డౌన్' అంటూ నినదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా గ్రామ/వార్డు వలంటీర్ స్టేట్ అసోసియేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.దీప్తి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలు సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామ/వార్డు వలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనంగా రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. బకాయి ఉన్న ఏడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని, రాజీనామా చేసిన వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. 2.10 లక్షల మంది మహిళా వలంటీర్లను ప్రభుత్వం రోడ్డున పడేసిందని, మహిళలపై ఇదేనా మీకున్న గౌరవమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసులు గాంధీ పార్కు వద్ద మోహరించారు. నిరసన ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్తున్న వలంటీర్లను అడ్డుకున్నారు. చిన్న పిల్లలు ఉన్నారని చెప్పినా వినిపించుకోలేదు. చంద్రబాబు నగరం నుంచి వెళ్లిపోయిన అనంతరం వలంటీర్లను అక్కడి నుంచి వెళ్లనిచ్చారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

వలంటీర్లను కొనసాగించాలి

గ్రామ/వార్డు వలంటీర్లను యథావిధిగా కొనసాగించాలని, చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి డిమాండ్ చేశారు. వలంటీర్లు చేస్తున్న ఆందోళనకు ఆమె మద్దతు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వలంటీర్లకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంతవరకు వలంటీర్లకు పనులు చెప్పకపోవడం, జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. వీరంతా ప్రభుత్వం నియమించిన వారేనని, రాజకీయ కార్యకర్తలు కాదన్నారు. తక్షణమే వలంటీర్లను యథావిధిగా విధుల్లో కొనసాగించాలని, బకాయి ఉన్న 7 నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో సిటు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఉపాధ్యక్షుడు జి.అప్పలరాజు, జిల్లా కార్యదర్శి పి.మణి తదితరులు మాట్లాడారు.

మహిళా కానిస్టేబుల్ అర్హత పరీక్షకు 307 మంది హాజరు



పరుగు పోటీల పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం మహిళా అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 718 మందికి 307 మంది అభ్యర్థులు హాజరైనట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, బ్యాగేజ్ కౌంటర్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ), పరుగు పోటీలు నిర్వహించారు. 186 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పలు విభాగాల సీఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

ఏయూ దూరవిద్య డిగ్రీ పరీక్షలకు నోటిఫికేషన్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్యా విధానంలోని డిగ్రీ కోర్సుల పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైంది. 2018, ఆ తర్వాత అకడమిక్ విద్యా సంవత్సరాల్లో బి.ఎ., బి.కాం., బి.ఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫిబ్రవరి 12 నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీడీఈ డైరెక్టర్ ఆచార్య విజయ్ మోహన్ తెలిపారు. ఈ నెల 6 నుంచి వెబ్‌సైట్‌లో పరీక్షల టైమ్ టేబుల్ అందుబాటులో ఉంటుందన్నారు. విద్యార్థులు యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.40.89 లక్షలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. గత నెల 23 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు హుండీల ద్వారా రూ.40,89,462 నగదు, 96.280 గ్రాముల బంగారం, కిలో 275 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. లెక్కింపులో పోలమాంబ ఆలయ ఈవో కె.గాయత్రి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ డేవిడ్ రాజు, గోపాలపట్నం శ్రీహరి సేవ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ లక్ష్యం

ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

మహారాణిపేట: పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వం తపన పడుతోందని, అందులో భాగంగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం పాత జైల్ రోడ్‌లోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. పేద విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వమే సమకూరుస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం స్వయంగా వడ్డన చేసి విద్యార్థులతో కలిసి మంత్రి సహపంక్తి భోజనం చేశారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 10 జూనియర్ కళాశాలల్లో 5,600 మంది విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనం అందిస్తున్నామన్నారు. ఆర్డీవో పి.శ్రీలేఖ, ఎమ్మెల్సీ రామారావు, కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, డీఈవో ప్రేమ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, మహిళా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జె.విజయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ

- ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు
- ముగిసిన ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్



బాలుర ఓవరాల్ చాంపియన్స్ గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు



బాలికల ఓవరాల్ చాంపియన్స్ భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ క్రీడాకారులు

మురళీనగర్: ఆటల్లో పాల్గొనడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ప్రముఖ బాక్సింగ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ప్రాంతీయ మీట్ ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆటలతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరిగి ఆరోగ్యం సిద్ధిస్తుందని, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపగలుగుతారన్నారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను చేరుకోవడానికి క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణ రావు మాట్లాడుతూ ఓటమి గెలుపునకు సోపానమన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్ కె.అబ్బాస్ బేగ్ పర్యవేక్షణలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు ట్రోఫీ, జ్ఞాపికలు అందించారు. పోటీల నిర్వహణకు సహకరించిన ప్రిన్సిపాల్స్, ఫిజికల్ డైరెక్టర్లను అభినందించారు. సమావేశంలో గెస్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐవీఎస్ శ్రీనివాస్, భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, వివిధ ప్రైవేట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. ఇంగ్లిష్ సీనియర్ లెక్చరర్ సరళబాయి, మెకానికల్ లెక్చరర్ మౌనిక సహకరించారు.

చాంపియన్స్ వీరే..

ఈ పోటీల్లో 24 పాలిటెక్నిక్ కాలేజీల క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో గిడిజాల సాయిగణపతి పాలిటెక్నిక్ విద్యార్థులు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల నుంచి భీమిలి ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ విద్యార్థులు అత్యధిక ట్రోఫీలు గెలుచుకుని తమ సత్తా చాటారు. బాలురు ఓవరాల్ చాంపియన్ గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్, బాలికల ఓవరాల్ చాంపియన్స్‌గా భీమిలి ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ విద్యార్థులు నిలిచారు. బాలుర గేమ్స్ చాంపియన్‌గా గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్, బాలికల గేమ్స్ చాంపియన్‌గా భీమిలి ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్, బాలుర స్పోర్ట్స్ చాంపియన్స్ గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్, బాలికల స్పోర్ట్స్ చాంపియన్‌గా భీమిలి పభుత్వ మహిళ పాలిటెక్నిక్ సాధించారు. బాలుర విభాగంలో గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్ నుంచి వ్యక్తిగత చాంపియన్స్ ఎస్.ఈశ్వర్ వర్దన్, బాలికల వ్యక్తిగత చాంపియన్‌గా ఎస్.మల్లీశ్వరి నిలిచారు. వీరికి ట్రోఫీలు అందించారు.



వ్యక్తిగత చాంపియషిప్ అందుకుంటున్న మల్లీశ్వరి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మృతుడు హత్య కేసులో నిందితుడు

పెందుర్తి: వేపగుంట–పినగాడి రహదారి వేపగుంట సమీపంలో ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు ఓ హత్య కేసులో నిందితుడు. వివరాలివి..సుజాతనగర్ ప్రాంతానికి చెందిన రాయవరపు వెంకటేష్(23), స్నేహితుడు దుర్గాప్రసాద్ కలిసి గురువారం రాత్రి పినగాడి సమీపంలోని ఓ దాబాకు వెళ్లి తిరిగి వస్తున్నారు. వేపగుంట సమీపంలోని రోడ్డు గొయ్యిలో బైక్ దిగడంతో వెనుక కూర్చున్న వెంకటేష్ కిందపడి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. అతన్ని కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారంమరణించాడు. కాగా వెంకటేష్ గతేడాది సుజాతనగర్‌లో జరిగిన వృద్ధురాలు వరలక్ష్మి హత్య కేసులో నిందితుడు. ప్రస్తుతం అతడు బెయిల్‌పై ఉండగా ప్రమాదంలో మరణించాడు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

పోలీస్ సిబ్బందికి బదిలీ

అల్లిపురం: నగరంలో పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 31 మంది ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలు చేయాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు పంపిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

రేపటి నుంచి అప్పన్న ఉత్తర ద్వార దర్శనం టికెట్ల విక్రయం

సింహాచలం: సింహగిరిపై ఈనెల 10న జరిగే ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తరద్వార దర్శనానికి రూ.500 టికెట్ల విక్రయాలు సోమవారం నుంచి 9వ తేదీ వరకు జరుపుతామని దేవస్థానం ఈవో వి.త్రినాధరావు తెలిపారు. సింహగిరిపై పాత పీఆర్‌వో కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విక్రయాలు జరుగుతాయని తెలిపారు. అలాగే https://www.aptemples.ap.gov.inలో కూడా టికెట్లు లభిస్తాయని తెలిపారు.

ఇండిగో దారి మళ్లింపు

గోపాలపట్నం: ముంబయి నుంచి విశాఖ వస్తున్న ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో దారి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విమానం ముంబయి నుంచి బయలుదేరిన తర్వాత ఈ సమస్య తలెత్తడంతో.. హైదరాబాద్‌లో అత్యవసరంగా దించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు మంత్రి నారా లోకేష్ రాక

మహారాణిపేట: రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆదివారం విశాఖ వస్తున్నారు. ఉదయం 9 గంటలకు విజయవాడ నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ప్రధాన మంత్రి పర్యటన నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాంనగర్‌లోని నగర టీడీపీ కార్యాలయంలో విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు బయలుదేరుతారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులపై ప్రధాని స్పష్టత ఇవ్వాలి

విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు



మాట్లాడుతున్న నరసింగరావు

డాబాగార్డెన్స్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖలో పర్యటిస్తున్న సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు సమకూర్చడంపై స్పష్టత ఇవ్వాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. శనివారం సిటూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సొంత ఇనుప ఖనిజం గనులున్న ప్రతి స్టీల్‌ప్లాంట్‌కు టన్నుకు రూ.600 (ఇనుక ఖనిజం తవ్వకానికి) ఖర్చు అవుతుందన్నారు. అయితే ప్రస్తుతం విశాఖ స్టీల్‌ప్లాంట్ రూ.8వేలుపైగా ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కారణంగా సాలీన రూ.3,500 కోట్లు అదనంగా ఖర్చు అవుతోందని, దీనిని నష్టంగా చూపించి కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కుట్ర చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై బీజేపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌కార్మికులు, అధికారులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం, ఉన్న జీతాన్ని కూడా తగ్గించి లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. జీతాలు రాకున్నా, నవంబర్, డిసెంబర్ నెలల్లో శత శాతం ఉత్పత్తి సాధించిందన్నారు. విశాఖ స్టీల్‌లో రెండు కన్వర్టర్ల ఉత్పత్తి 115 శాతం రికార్డు స్థాయిలో ఉత్పత్తి పెంచిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పోటీగా ఆర్సెలార్ మిట్టల్‌తో నక్కపల్లిలో ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌ను పెట్టించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా ఆర్సెలార్ మిట్టల్‌కు సొంత ఇనుప ఖనిజ గనులు కేటాయించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమాలోచనలు చేస్తున్నాయన్నారు. ఏ స్టీల్‌ప్లాంట్‌లో లేని విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 55 ఏళ్లు దాటిన వారందర్నీ తొలగించడానికి రంగం సిద్ధం చేసిందని, మరో వైపు ప్రతి కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న 30 శాతం కార్మికులను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాని మోదీ పర్యటన ముగిసిన తరువాత ఈ ప్రక్రియ నిర్వహించడానికి కేంద్రం ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసిందన్నారు. మోదీ పర్యటన సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిరసన వ్యక్తం చేసేందుకు నిర్ణయించిందని చెప్పారు. సోమవారం కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి చలో కలెక్టరేట్, 7న విశాఖ స్టీల్ పోరాటానికి మద్దతుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వామపక్షాల ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో సిటూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ దంపతులపై టీడీపీ వర్గీయుల దాడి

▶7వ పేజీ తరువాయి

తీవ్రంగా గాయపరిచారు. దాడిలో రేగారావు కంటితో పాటు శరీరంలోని పలుచోట్లతీవ్రంగా గాయాలు కావడంతో పరవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స నిర్వహించి శనివారం డిశ్చార్జ్ చేశారు. రాజకీయ కక్షలతో దాడి చేశారని 2వ తేదీనే మణి ఫిర్యాదు చేసింది. అయినా ఇంతవరకు పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ వెన్నల అప్పారావు విమర్శించారు. దాడి చేసిన వ్యక్తులపై తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై పరవాడ సీఐ మల్లికార్జునరావును వివరణ కోరగా ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని వాటిపై విచారణ జరిపి రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు.